క్లుప్తంగా

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం తిరుపతికి చెందిన డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచి రోజుకు 5 వేల మంది పనిచేసేలా చూడాలని ఎంపీడీఓ నరసింహారావు అన్నారు. బుధవారం ఉపాధి హామీ ఏపీఓ భానుప్రియ, సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస కూలీ వచ్చేలా పనులు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఏఓ త్రివిక్రమ్‌రావు పాల్గొన్నారు.

నేడు రామాపురంలో జగనన్న సురక్ష

పిచ్చాటూరు: మండలంలోని రామాపురం సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అక్టోబర్‌లో ఎంబీయూ మోహన మంత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ నాగరాజరామారావు

చంద్రగిరి(తిరుపతి రూరల్): తిరుపతి సమీపంలోని మోహన్ బాబు యూనివర్సిటీలో అక్టోబర్‌లో జాతీయస్థాయి మోహన మంత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్న ట్లు వీసీ నాగరాజరామారావు తెలిపారు. ఆయన బుధవారం వర్సిటీలో మోహన మంత్ర లోగో, పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలు వెలికి తీసేందుకు ప్రతి ఏటా మోహన మంత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా పలు వర్సిటీల నుంచి దాదాపు 3 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. మోహన మంత్ర లోగో ఆవిష్కరణలో భాగంగా వెబ్ సైట్ లాంచ్, స్పాన్సర్ షిప్ బ్రోచర్, కల్చరల్ పోస్టర్, టెక్నికల్ పోస్టర్లు ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ సారథి, డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ రవిశేఖర్ అడ్వైజర్ రవిచంద్ పాల్గొన్నారు.

వేమన పద్యాలపై చిత్రలేఖన పోటీలు

తిరుపతి కల్చరల్: వేమన పద్యాలలోని భావాన్ని వ్యక్తీకరించేలా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, శ్రీకళా క్షేత్రం కార్యదర్శి సాగర్ తెలిపారు. వారు బుధవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 6, 7, 8 తరగతులు, 9, 10, ఇంటర్, డిగ్రీ ఆపై తరగతుల విద్యార్థులకు మూడు విభాగాలుగా పోటీలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు చిత్రించిన చిత్రాలను ఆగస్టు 15వ తేదీలోపు మెయిల్ చేయాలని సూచించారు. మొదటి రెండు విభాగాల విజేతలకు రూ.3000, రూ.2000, రూ.1000 చొప్పున, మూడో విభాగం విజేతలకు రూ.4000, రూ.3000, రూ.2000 నగదు బహుమతి అందజేస్తామన్నారు.

యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగుల వ్యక్తిగత సమాచారాన్ని ఆయా స్కూళ్లలోని ఉపాధ్యాయులు నేషనల్ కౌన్సి ల్ ఆఫ్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ రూపొందించిన ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయుడు గోపికృష్ణ అన్నారు. బుధవారం పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సెల్‌ఫోన్‌లో ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, అప్‌లోడ్‌పై అవగాహన కల్పించారు. ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ లోగా అన్ని స్కూళ్లలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు వ్యక్తిగత సమాచారం ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారికి అవసరమైన సంక్షేమ పథకాలు, రాయితీలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఏపీ మాజీ గవర్నర్ నరసింహన్, కెనడా మంత్రి దీపక్ ఆనంద్, రేమండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా బుధవారం దర్శించుకున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి



మల్లంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అముడూరు పంచాయతీలోని మల్లంపల్లి, అముడూరు, ఎస్సీకాలనీల్లో ఆయన బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎంపీ గురుమూర్తితో కలిసి గడపగడపకు మనప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లోని 315 కుటుంబాలను కలిశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. మల్లంపల్లి, అముడూరు, ఎస్సీకాలనీల్లో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి నివేదించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం, జనసేన పార్టీలు ప్రజాసంక్షేమాన్ని గాలి కొదిలేశాయని వివరించారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా సీఎం జగనన్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి గడపలో వైఎస్సార్‌సీపీకి ప్రశంసలు, ఆశీస్సులు అందుతున్నాయని చెప్పారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించగలిగామని వెల్లడించారు.

ప్రజల నుంచి విశేష ఆదరణ..

తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ పేదల అభివృద్ధికి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లపై విషం వెళ్లగక్కుతున్నారని దుయ్యబట్టారు. జగనన్న కాలనీలు ఏకంగా పట్టణాలుగా ఏర్పాటు అవుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్ సుబ్బమ్మ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్, మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, నాయకులు గోవిందరెడ్డి, మురళి, చంద్రశేఖర్, పెరుమాళ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, గిరి యాదవ్, రామచంద్రారెడ్డి,డిల్లీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తికి ఘన సన్మానం



జిల్లా న్యాయమూర్తి అన్వర్‌బాషాను సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయస్థాన భవనంలో బుధవారం 12వ అదనపు జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి అన్వర్‌బాషాను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు న్యాయవాదులను సంప్రదించి త్వరగా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్‌నాథ్, పట్టాభిరెడ్డి, వెంకటస్వామి, కన్నలి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 12, 15వ వార్డుల సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 516 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పురపాలకసంఘ ఇన్‌చార్జ్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, నాయకులు హరినాథ్‌నాయుడు, గణేష్, మల్లికార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించండి



కీళపూడిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అంబుడ్స్‌మెన్

పిచ్చాటూరు: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు అన్నారు. బుధవారం పిచ్చాటూరు మండలం కీళపూడి, నాగలాపురం బైటకొడియంబేడు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. పనికి వచ్చే కూలీలకు గరిష్ఠ వేతనం రూ.272 వచ్చేలా పనులు కేటాయించాలని సిబ్బందికి సూచించారు. ఆగస్టు 31 లోగా ప్రతి మండలంలో కనీసం 1000 మంది వంద రోజులు పూర్తి చేయించాలని ఆదేశించారు. పిచ్చాటూరు, నాగలాపురం మండలాల ఏపీఓలు నాగభూషణమ్మ, సుధాకరుడు, జేఈలు సురేష్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

ముక్కంటి గోశాలకు ఆవు, దూడ వితరణ



ఆవు, దూడను అందజేస్తున్న చింత బాలప్రసాద్, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు ఏర్పేడు మండలం చింతపాళెం గ్రామానికి చెందిన చింత బాలప్రసాద్, కుటుంబ సభ్యులు బుధవారం ఆవు, దూడను వితరణగా అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గోశాల సిబ్బంది, అర్చకులు గోవిందశర్మ, పట్టణ ప్రముఖులు నరసింహులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ



జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత జగనన్న విద్యాకానుకలో భాగంగా 10482 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక ఎంఆర్సీలోని పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను కేటాయిస్తోందని తెలిపారు. నాడు–నేడులో పాఠశాలల రూపురేఖలను మార్చేశారన్నారు. జగనన్న విద్యాకానుక పథకంలో ప్రతి విద్యార్థికి మూడు జతల బట్టలు, ఒక జత షూ, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నారని తెలిపారు.

నేడు తండ్లంలో గడప గడపకు..

రేణిగుంట: మండలంలోని తండ్లం గ్రామ పంచాయతీలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

గంగమ్మకు మత్స్యకారుల పూజలు



అరణియార్ కట్టపై గంగమ్మకు పూజలు చేస్తున్న మత్స్యకారులు

పిచ్చాటూరు: అరణియార్ మత్స్యకార్మిక సంఘం అధ్వర్యంలో జలాశయం కట్టపై ఉన్న గంగమ్మకు బుధవారం పూజలు చేశారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నరేంద్ర బాబు మాట్లాడుతూ.. ఏటా చేపల వేట విరామ సమయంలో అరణియార్ మత్స్యకార్మిక సంఘం సభ్యులు గంగమ్మకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మేకపోతు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులో నిండుగా నీరుండాలని, తద్వారా మత్స్య సంపద పెరగాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఉపాధి పనులతో సాగునీటి కాలువల అభివృద్ధి

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు





సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ, హాజరైన సభ్యులు, అధికారులు

వరదయ్యపాళెం: సాగునీటి కాలువల పూడికతీత, అభివృద్ధి పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు నిర్వహించాలని మండల సర్వసభ్య సమావేశంలో గుడాలవారిపాళెం సర్పంచ్ చంద్రారెడ్డి, మరికొందరు కోరారు. బుధవారం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మండల ప్రగతి గురించి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంరాజు నివేదించారు. సర్పంచ్ కోరిక మేరకు మండలస్థాయిలో సాగునీటి కాలు వల వివరాలను పరిశీలించి తక్షణమే పూడికతీత పనులు చేపడుతామని ఉపాధి హామీ ఏపీఓ భాస్కర్ తెలిపారు. అలాగే మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 2,700 మంది ఉపాధి కూలీలు రోజువారీ పనులు చేపడుతున్నట్లు వివరించారు. మండల వ్యవసాయాధికారి సుహర్‌లత మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 121మందికి కౌలుదారు కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. సత్యవేడులో రూ.75 లక్షలతో నిర్మించిన అగ్రిల్యాబ్‌లో అన్ని రకాల టెస్టులు చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ సరస్వతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 1,417 ఇళ్లు మంజూరు కాగా అందులో 817 ఇళ్లు పూర్తయ్యాయని.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ ఏఈ తెలిపారు. ఎంపీపీ పద్మప్రియ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష ఆదరణ



జగనన్న సురక్షలో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి

- బియ్యపు పవిత్రా రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష ఆదరణ వస్తోందని, ప్రజాసమస్యలు పరిష్కారమే ధ్యేయంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. బుధవారం తొట్టంబేడు మండలంలోని గుండేలుగుంట, పెద్దకనపర్తి సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. అలాగే గత ఎన్నికలలో ప్రజలకు చెప్పిన మాట ప్రకారం గెలిచినప్పటి నుంచి ఈరోజు వరకు కూడా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తిలోని ఎమ్మెల్యే కార్యాలయంలోనే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. అలాగే గ్రామాల్లో మీకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అనంతరం గుండేలుగుంటలో 640 మందికి, పెద్దకనపర్తిలో 638 మందికి సర్టిఫికెట్లను అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లారెడ్డి, వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్ బాబు, నాయకులు ధర్మారెడ్డి, రంగయ్య, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, మునికృష్ణయ్య, వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పుత్తేరిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం పుత్తేరి గ్రామంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి సేవలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యాంపు నిర్వహించే రోజున వారికి కావాల్సిన ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌పాల్, రమేష్, ధర్మయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి





కందాడులో సర్టిఫికెట్లు అందుకుంటున్న లబ్ధిదారురాలు, వలంటీర్‌ను సన్మానిస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: కరోనా వేళ ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం కందాడు, గుడిమల్లం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయన ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవామిత్ర ప్రశంసాపత్రాలు అందజేశారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు ఎనలేనివని ఆయన కొనియాడారు. అలాగే రాష్ట్ర ప్రజలకు జగనన్న సురక్ష ఓ వరమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కందాడు, మోదుగులపాలెంలో 997 మందికి, గుడిమల్లంలో 634 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్ధన్‌రెడ్డి, జమ్మల శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌లు శ్రీదేవి, సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, నాయకులు కందాటి ప్రభాకర్‌రెడ్డి, రాంబత్తి, పరంధామరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, దినేష్ యాదవ్, పవన్‌కుమార్, తహసీల్దారు శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్లాట్ల కోసం చదును చేసిన భూమి

- డీకేటీ స్థలాల్లో ప్లాట్లు వేస్తే కఠిన చర్యలు
- తహసీల్దార్ హెచ్చరిక

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని శివనాథపాళెం రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 149–1లో 1.70 ఎకరాలు, 149–2లో 6 ఎకరాల నోషనల్ భూములు ఉన్నాయి. ఇటీవల కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పి భూములను ఆక్రమించి వాటిని చదును చేసి ప్లాట్ల వేసేందుకు రంగం సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించారు. ఈ భూముల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు..



మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. డీకేటీ స్థలాల్లో అక్రమంగా ప్లాట్లు వేస్తే వాటిని స్వాధీనం చేసుకుంటాం. ఎమ్మెల్యే పేరు చెప్పి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వం పంపిణీ చేసిన డీకేటీ భూములను అనుభవించే అవకాశం మాత్రమే ఉంటుంది. వాటిలో ప్లాట్లు వేసి విక్రయించేదానికి అవకాశం ఉండదు.

–సుధీర్ రెడ్డి, తహసీల్దార్, తొట్టంబేడు

నిరుపేద ఆటోడ్రైవర్లకు ఉచితంగా లైసెన్సులు



లైసెన్సులను అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

శ్రీకాళహస్తి: అర్హత ఉండి లైసెన్సు లేక పోలీసుశాఖ వారితో ఇబ్బందులు పడుతున్న 60 మంది ఆటోడ్రైవర్లకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉచితంగా అందజేశారు. వీటిని బుధవారం ఎంపీ గురుమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. ఆటో కార్మికులను అనిన విధాలుగా ఆదుకునేది ఒక జగనన్న ప్రభుత్వమే అని చెప్పారు. రూ.20వేలు ఖర్చు అయ్యే లైసెన్సును ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, బీఎంఎస్‌ఆర్ ఆటో యూనియన్ నాయకులు సురేష్, ఖాదర్‌బాషా, జులేషా, కన్నయ్య, శ్రీనివాస్, మోహన్, శ్రీనివాసరావు, ఫారుక్, శేఖర్, షాజహాన్, గోపి, వెంకటేష్, శంకర్‌రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.